క్లుప్తంగా

లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదికకు విరాళం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న కల్యాణ వేదిక నిర్మాణానికి భక్తులు సూరపనేని జయప్రసాద్, వెంకటరమణ దంపతులు రూ.51,116 విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు మంగళవారం విరాళం నగదును దాతలు అందజేశారు. శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక నిర్మాణానికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి తమవంతు విరాళాలను అందజేస్తున్నట్లు శ్రీధర్ తెలిపారు. అందరి సహకారంతో త్వరితగతిన కల్యాణ వేదిక నిర్మాణం పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులు జాస్తి ఫణిశేఖర్, శ్రీనివాసరావు, కాసన్నేని నాని పాల్గొన్నారు.

నేడు గోపాలకృష్ణస్వామి కల్యాణోత్సవం



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగోపాలకృష్ణస్వామివారి ఆలయంలో మంగళవారం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఆలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా గోపూజ, హోమం, స్వామివారికి అభిషేకం, విశేష అలంకరణ చేశారు. కాగా ఆలయంలో బుధవారం రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 7వ తేదీ రాత్రి స్వామివారికి పవళింపుసేవ జరుగుతుందన్నారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనాలని కోరారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పోరంకిలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. పోరంకి వాసవీ క్లబ్ నవనిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ పాఠశాలలో త్రినేత్ర కంటి ఆస్పత్రి సహకారంతో విద్యార్థులకు కంటి పరీక్షలు చేయించారు. వైద్యులు బిందుమాధవి, మౌనిక 100 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు పెనుగొండ హారిక, రీజన్ చైర్ పర్సన్ ఖాజా రమేష్, రాచమడుగు మానస, కారంశెట్టి వెంకటమస్తానయ్య, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిరం వార్షికోత్సవం



పెనమలూరు: పోరంకి శ్రీనివాసానగర్‌లోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరం వార్షికోత్సవాన్ని మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా మందిరం 30 వార్షికోత్సవం సందర్భంగా భక్తులు 108 లీటర్ల ఆవు పాలతో బాబాకు అభిషేకం చేశారు. అనంతరం బాబాను ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు బాబాను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

దాతల సాయంతో టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: దాతల సాయంతో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు కానుమోలు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.పద్మజ తెలిపారు. పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న టెన్త్ విద్యార్థులకు ప్రతి రోజు సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు చింతల కోటేశ్వరరావు ముందుకు వచ్చారన్నారు. దాత కోటేశ్వరరావుకు ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

భౌ భౌలతో బెంబేలు

- స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలు
- కుక్కల దాడిలో గాయపడుతున్న ప్రజానీకం
- ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు
- పట్టించుకోని పంచాయతీ, మున్సిపల్ యంత్రాంగం
- భయాందోళనలో ప్రజలు



గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

కంకిపాడు: పగలూ లేదూ.. రాత్రీ లేదూ.....వీధి కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. గుంపులుగా కనబడ్డ ప్రతి ఒక్కరిపైనా ఎగబడుతూ స్వైరవిహారం చేస్తున్నాయి. విచక్షణారహితంగా దాడి చేస్తూ గాయపరుస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామ కూడళ్లు, జాతీయ రహదారి మీదుగా రాకపోకలు అంటేనే జనం భీతిల్లుతున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ, మున్సిపల్ అధికారులు ఏ ఒక్కరూ కుక్కల దాడి నుంచి ప్రజలను సంరక్షించే చర్యలు తీసుకోవటం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు.

707 మంది కుక్కకాటుకు గురి..

పెనమలూరు నియోజకవర్గంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలతో పాటుగా తాడిగడప మున్సిపాలిటీ, ఉయ్యూరు నగర పంచాయతీ ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో అధికారికంగా ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి రెండు నెలల్లో 707 మంది కుక్కకాటుకు గురయ్యారు. అనధికారికంగా మరో 400 మంది వరకూ ఉండొచ్చని అంచనా. వీధి కుక్కలకు తోడు పిచ్చికుక్కల స్వైరవిహారం కూడా అధికంగా ఉంది. ఇటీవల ఒకే రోజు పోరంకిలో పిచ్చికుక్క విచక్షణారహితంగా దాడి చేయటంతో 18 మంది గాయాలపాలయ్యారంటే నియోజకవర్గంలో వీధి కుక్కల బెడద తీవ్రత ఎంతో అర్థమవుతోంది.

గుంపులుగా సంచారం..

నియోజకవర్గం వ్యాప్తంగా వీధి కుక్కల సమస్య అధికంగా ఉంది. ప్రతి గ్రామంలోనూ గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి. ప్రత్యేకించి విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి, జాతీయ రహదారి మధ్యన ఉన్న డివైడర్లను, విజయవాడ-అవనిగడ్డ కరకట్ట వెంబడి ముళ్లపొదలను ఆవాసంగా చేసుకుని కుక్కలు జీవనం సాగిస్తున్నాయి. ఒంటరిగా వెళ్లే వాహనదారులు, పాదచారులపై ఎగబడి విచక్షణారహితంగా దాడి చేసి గాయపరుస్తున్నాయి. ప్రత్యేకించి రాత్రి వేళల్లో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు లక్ష్యంగా కుక్కలు యథేచ్ఛగా దాడి చేస్తుండటంతో వాహనదారులు రాత్రివేళల్లో ప్రయాణం అంటేనే హడలిపోతున్నారు.

ఆస్పత్రులు	జనవరిలో బాధితులు	ఫిబ్రవరిలో బాధితులు
పెనమలూరు పీహెచ్‌సీ	105	95
కంకిపాడు సీహెచ్‌సీ	122	122
ఉప్పలూరు పీహెచ్‌సీ	21	33
ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రి	80	76
ఉయ్యూరు యుపీహెచ్‌సీ	4	3
కాటూరు పీహెచ్‌సీ	14	17
చిన ఓగిరాల పీహెచ్‌సీ	9	6
మొత్తం	355	352

పత్తా లేని అధికారులు..

వీధి కుక్కల బెడద రోజురోజుకీ తీవ్రం అవుతోంది. అయినా సంబంధిత గ్రామ పంచాయతీలు కానీ, మున్సిపల్ అధికారులు కానీ కనీసం పట్టించుకున్న పాపాన పోవటం లేదనే ఆరోపణలున్నాయి. కుక్కల దాడుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేలా ఎలాంటి చర్యలూ తీసుకోవటం లేదు. ఆఖరికి పిచ్చికుక్కలను సైతం జనావాసాలకు దూరంగా తరలించే చర్యలూ చేపట్టడం లేదు. గుంపులుగా సంచరిస్తున్న కుక్కలను పట్టి అటవీ ప్రాంతాలకు తరలించే చర్యలు తీసుకుంటే తప్ప వీధి కుక్కల బెడద నుంచి మోక్షం లభించదు. కానీ పంచాయతీ, మున్సిపల్ అధికారులు, మండల స్థాయి అభివృద్ధి అధికారులు సైతం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ ప్రజల ప్రాణాలకు రక్షణ చర్యలు చేపట్టకపోవటం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఘనంగా జాతీయ లైన్‌మెన్ దినోత్సవం



ఉత్తమ లైన్‌మెన్ గోవర్ధనప్రసాద్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఈఈ కృష్ణనాయక్

ఉయ్యూరు: నాణ్యమైన విద్యుత్ సరఫరాలో లైన్‌మెన్‌ల పాత్ర కీలకమని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని 40 మంది ఉత్తమ సేవలు అందించిన లైన్‌మెన్‌లు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. ఈఈ కృష్ణనాయక్ మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరూ అభినందనీయులన్నారు. ప్రకృతి విపత్తుల్లో మెరుగైన సేవలు అందించే ఉద్యోగులు విద్యుత్ రంగంలో ఉన్నారన్నారు. మెరుగైన విద్యుత్ సరఫరా, ఉత్తమ సేవలే లక్ష్యంగా పని చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ హేమకుమార్, ఏఈలు బసవశాస్త్రులు, నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటరాజు, గోపి పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరువు పూడికతీత పనులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని రామయ్య చెరువు పూడికతీత పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. చెరువులో కలుస్తున్న మురుగు, చెత్త డంపింగ్, ఆక్రమణలపై ఇటీవల సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు తొలుత చెత్త డంపింగ్ సమస్యను పరిష్కరించారు. ప్రస్తుతం చెరువు ప్రక్షాళన పనులను ప్రారంభించారు. చెరువు చుట్టూ అల్లుకుపోయిన ముళ్లకంపలు, చెట్ల పొదలను జేసీబీతో తొలగించారు. చెరువులో కలుషితమైన నీటిని పైపుల ద్వారా తోడిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సాక్షి స్పందన



జేసీబీతో తొలగిస్తున్న చెట్ల పొదలు, ముళ్ల కంపలు

మోటారు బోర్ల సహాయంతో చెరువును తోడిస్తున్నామని మరో రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో నీటి తోడింపు పనులు పూర్తవుతాయన్నారు. చెరువు చుట్టూ కట్ట బలోపేతం నిమిత్తం కట్టలు పోస్తామని చెప్పారు.

వైభవంగా కోటయ్యస్వామి ఉరుసు

గన్నవరం: స్థానిక కొత్తపేటలో వేంచేసి ఉన్న శ్రీకోటయ్యస్వామి దేవస్థానంలో మంగళవారం కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో 15వ ఉరుసు మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిపారు. అనంతరం స్వామివారి సన్నిధిలోని లడ్డూ ప్రసాదాన్ని వేలంలో కృష్ణబలిజ సంఘ రాష్ట్ర నాయకులు వీసం శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు దక్కించుకున్నారు. తొలుత శ్రీకోటయ్యస్వామిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్‌బాబు, మాజీ ఎంపీపీ తుల్లిమిల్లి ఝాన్సీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు తదితరులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. సంఘ నేతలు వీసం నాగబాబు, మొవ్వ కిరణ్, అత్తులూరి కొండలరావు, కోలా వెంకటనాగేశ్వరరావు, వీసం వెంకటసత్యనారాయణ, తుపాకుల సుబ్రహ్మణ్యం, అత్తులూరి దుర్గాప్రసాద్, బత్తుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందుకుంటున్న వీసం దంపతులు

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

గన్నవరంరూరల్: మండలంలోని కట్టుబడిపాలెం, ముదిరాజుపాలెం గ్రామాల్లో మంగళవారం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ముస్తాబాద పశువైద్య చికిత్స కేంద్రం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మేరీ వైడూర్యం ఆధ్వర్యంలో 290 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు అందజేశారు. గాలికుంటు వ్యాధి టీకాల వల్ల పాల ఉత్పత్తిని రక్షించుకోవచ్చన్నారు. మగ పశువుల్లో పని సామర్థ్యం తగ్గదన్నారు. దూడల్లో మరణాలు నివారించవచ్చని చెప్పారు. ఆరోగ్యంగా ఎదగడానికి ఈ టీకా ఉపయోగపడుతుందన్నారు. బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాతో పెయ్య దూడలను రక్షించుకోవాలని చెప్పారు. ఈ వ్యాధికి చికిత్స లేదని టీకా ఒకటే మార్గమన్నారు. పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవటంతో పశుపోషకులు ఆర్థిక ప్రగతి సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



ముదిరాజుపాలెంలో వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ మేరీ వైడూర్యం, సిబ్బంది

126 మందికి కంటి వైద్య పరీక్షలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక రాణిగారితోట, 17వ డివిజన్‌లోని సుందరయ్య గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అమరావతి ఐ హాస్పిటల్ వైద్యులు పాల్గొని 126 మందికి నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు ఐ డ్రాప్స్, కళ్ల జోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయం కమిటీ కన్వీనర్ ఎస్.హరినారాయణ మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం గ్రంథాలయం ఆవరణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కృష్ణలంక, రాణిగారితోట, బాలాజీనగర్, రామలింగేశ్వరనగర్ తదితర ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.కృష్ణ, టి.చంద్రశేఖర్, వై.కృష్ణ, కోటిరెడ్డి, రమాదేవి, ఆదాం, అమరావతి ఐ హాస్పిటల్ మేనేజర్ స్వరూప్, డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

హెల్మెట్‌తో ప్రాణాలకు భద్రత

గుణదల(విజయవాడతూర్పు): రోడ్డుపై ప్రయాణించే ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించడం ద్వారా వారి ప్రాణాలకు భద్రత లభిస్తుందని నాలుగో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆదినారాయణ సూచించారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు సమీపంలో మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు హెల్మెట్ వల్ల ఉపయోగాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. జుట్టు చెదిరిపోతుందని, తలనొప్పి వస్తుందని కుంటి సాకులు చెబుతూ చాలా మంది వాహన చోదకులు హెల్మెట్లు ధరించడం లేదన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. హెల్మెట్ ధారణ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. వాహనాల రికార్డుల కన్నా హెల్మెట్ ధారణే ముఖ్యమన్నారు. అందుకే న్యాయస్థానాలు సైతం హెల్మెట్ ధరించడం అనివార్యమని ప్రకటించాయని గుర్తు చేశారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు వాహన చోదకులు హెల్మెట్ వినియోగం తప్పనిసరని తెలిపారు. హెల్మెట్ ధరించని వాహన చోదకులపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ప్రయాణికుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. హెల్మెట్ వినియోగించని వారికి జరిమానా విధించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని వాణి విద్యానికేతన్‌లో మంగళవారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు సైన్స్ ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. బయోడైవర్సిటీ, పర్యావరణ పరిరక్షణ, చంద్రయాన్-3, రోడ్డు ప్రమాదాల నివారణ, యాంటీ గ్రావిటీ వీల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పలు పాఠ్యాంశాలకు సంబంధించిన సైన్స్ మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. సైన్స్ ఎక్స్‌పోను అధిక సంఖ్యలో తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు సందర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ నందిగం రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరా లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యానగర్ ఫీడర్‌లో బుధవారం ఉదయం 7 నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీనగర్‌కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, విద్యానగర్, మల్లికార్జున స్కూల్ రోడ్డు, మదర్ థెరిసా కాలనీ, ఎంపీడీఓ ఆఫీస్ ఏరియా, బుద్దవరం రోడ్డు, మెయిన్ రోడ్డు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

డాక్టర్ నారయ్యకు ఘనంగా వీడ్కోలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక మహాత్మా గాంధీనగర్‌లోని పీహెచ్‌సీ వైద్యుడు పుట్టి నారయ్యకు తోటి ఉద్యోగులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. గత ఆరేళ్లుగా బాపులపాడు పీహెచ్‌సీలో డాక్టర్‌గా సేవలు అందిస్తున్న నారయ్యకు పీజీ కోర్సులో సీటు సాధించటంతో ప్రభుత్వ విధులు నుంచి రిలీఫ్ అయ్యారు. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఆయనను ఘనంగా సత్కరించారు. డాక్టర్ నారయ్య సేవలను కొనియాడారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషా, సిబ్బంది పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రం పరీక్షపై విద్యార్థులకు సూచనలు

పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతి కామన్ పరీక్షలు రాసే విద్యార్థులకు భౌతిక శాస్త్రంలో ఉత్తీర్ణత సాధించడానికి జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ సులభమైన నమూనాలను సూచించారు. పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్‌లో భౌతికశాస్త్రానికి సంబంధించి కొన్ని ప్రయోగాలను ఉపయోగించి వాటి నమూనాలను విద్యార్థులకు వివరించారు. ఈ హైస్కూల్‌లో 145 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు: పోరంకి సాలిపేటలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు పట్టుకోవటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి పోరంకి సాలిపేట డీఎస్ఆర్ టవర్స్ వద్ద ఖాళీ స్థలంలో గ్రామానికి చెందిన పెడసగంటి హరిహరప్రసాద్ 20 బస్తాల రేషన్ బియ్యం ఉంచాడు. రేషన్ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో తరలించటానికి రంగం సిద్ధం చేసుకున్నాడు. దీనిపై సివిల్ సప్లయీస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో మచిలీపట్నం డీఎస్‌వో పార్వతి, డెప్యూటీ తహసీల్దార్ ప్రధాన్ ఘటనా స్థలానికి వెళ్లి బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. 50 కిలోల చొప్పున 20 బస్తాలు మొత్తం 10 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు నిందితుడు హరిహరప్రసాద్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. .



సివిల్ సప్లయీస్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు

పెనమలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకోవటంపై తల్లులకు, గర్భిణులకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీలత అన్నారు. వణుకూరు, గోసాల, గంగూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హెల్త్ ఉమెన్- హ్యాపీ ఉమెన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారం తయారు చేసుకుంటే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. చిరుధాన్యాలపై అవగాహన పొందాలని సూచించారు. తల్లులు, గర్భిణులకు రాగి లడ్డు తయారు చేయటం, ఆకుకూరలతో పకోడి తయారు చేయటం చూపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీలత

టెన్త్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని(15) అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప మనోజ్‌నగర్‌కు చెందిన జి.పద్మావతి భర్త, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటోంది. ఆమె కుమార్తె తాడిగడప జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈక్రమంలో ఈ నెల 2వ తేదీ ఉదయం విద్యార్థినిని ఆమె తండ్రి బైక్‌పై పాఠశాల వద్ద దించాడు. అయితే భోజన సమయంలో విద్యార్థిని పాఠశాల నుంచి బయటకు వచ్చి అదృశ్యమైంది. ఈ ఘటనపై విద్యార్థిని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేకు సహకరించాలి

పెనమలూరు: ఏపీ ప్రభుత్వం మండల పరిధిలో చేపట్టనున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేకు ప్రజలు సహకరించాలని మండల అభివృద్ధి అధికారి బండి ప్రణవి కోరారు. ఆమె మంగళవారం వివరాలు తెలుపుతూ రాష్ట్రంలో 18 సంవత్సరాలు పూర్తి చేసి 50 ఏళ్లలోపు ఉన్న వారు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు అర్హులన్నారు. హౌస్‌హోల్డ్ సర్వేలో ఉన్న వారికి మాత్రమే సర్వే చేస్తామని తెలిపారు. సర్వేలో అర్హులైన వారికి భవిష్యత్తులో వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. సర్వేకు సచివాలయ సిబ్బంది వచ్చిన సమయంలో సహకరించాలని కోరారు. సిబ్బంది సర్వేకు వచ్చిన సమయంలో సంబంధిత వ్యక్తులు అందుబాటులో లేకపోతే ఆధార్ అనుసంధానమైన ఫోన్ ద్వారా ఓటీపీ చెప్పి సర్వే నమోదు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. ఈ అవకాశాన్ని యువతీ, యవకులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు ద్రోణాదుల సత్యనారాయణ సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈవో పితాని తారకేశ్వరమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముస్లింలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలి

పాయకాపురం(విజయవాడరూరల్): ముస్లింలకు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా డిమాండ్ చేశారు. కండ్రికలో 57వ డివిజన్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ముస్లిం కుటుంబానికి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు. పేద ముస్లింలకు సేవ చేయాలనే సదుద్దేశం ఉన్న వారు ఆజాద్ ముస్లిం కమిటీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు.